RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 339 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 04-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

ఆపివేయువాని,యపహసించెడి వాని,
మేకవన్నె పులిగ మెలుగువాని,ఒ
లెక్కజేయకుండ జక్కగా నీదారి
కదలి పోవ నీకు కలుగు జయము

మీ
విజయ ప్రసాద్ నలుమాసు
కవి, తెలుగు బోధకులు

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



## భారత్ దాడులు చేస్తే బుద్ధి చెబుతాం

- మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది
- మరోమారు నోరు పారేసుకున్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా

ఇస్లామాబాద్,

:పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడు తోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా -మిగతా 2 లో

## ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్



2

## టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

**టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం.**

- చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ
- ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం
- దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం.
- ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది.
- ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్ ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన -మిగతా 2 లో








## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు
- టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది.. ఎవరైనా వాడుకోవచ్చు
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు.

-మిగతా 2 లో



## చెపాక్‌లో చెన్నైకి షాక్..

- సొంతగడ్డపై 'సూపర్ కింగ్స్'కు తప్పని పరాజయం.
- రుద్రరూపం దాల్చిన కింగ్స్ బ్యాటర్లు:
- అయ్యర్, ప్రభ్‌సిమ్రన్ మెరుపులు!
- హ్యాట్రిక్ దిశగా పంజాబ్ కింగ్స్..
- 210 పరుగుల భారీ లక్ష్యం కూడా పంజాబ్‌కు జుజూబీ!

న్యూఢీల్లి
పంతొమ్మిదో సీజన్‌లో ఛేజింగ్ జట్టుకు మరో విజయం. తొలిపోరులో గుజరాత్ టైటాన్స్‌కు చెక్ పెట్టిన పంజాబ్ కింగ్స్ ఈసారి చెన్నై సూపర్ కింగ్స్‌ను చిత్తు చేసింది. భారీ స్కోర్ మ్యాచ్‌లో శ్రేయాస్ అయ్యర్(50)కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడగా.. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(43), ప్రియాన్ష్ ఆర్య(39)లు దంచేశారు. ఫలితంగా పంజాబ్ వరసగా రెండో విజయం నమోదు చేయగా.. సొంత మైదానంలో గెలిచి బోణీ కొట్టాలనుకున్న -మిగతా 2 లో



## భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

- అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం
- శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత.
- ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది
- విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

2

## రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

- పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం
- నిధులు సమకూర్చాలని సీఎం రేవంత్ ఆదేశం


హైదరాబాద్ ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా

-మిగతా 2 లో



## ఢిల్లీలో కంపించిన భూమి..

- ప్రాణ భయంతో పరుగులు తీసిన జనం..!



2

## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

- బిజెపిలో రాముడి రాజకీయం
- ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్




మంచిర్యాల, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. -మిగతా 2 లో

## ట్రంప్ 'టారిఫ్' బాంబు

- మరోసారి టారిఫ్ వార్ ప్రకటించిన ట్రంప్
- విదేశీ మందులపై 100 శాతం పన్ను విధింపు!
- ఔషధ రంగంపై ట్రంప్ సర్కార్ కఠిన నిర్ణయం.
- దిగుమతి మందులపై సుంకాల మోత మోగించిన ట్రంప్.



న్యూఢీల్లి
ఒకవైపు ఇరాన్ మీద యుద్ధంతో బిజీగా ఉన్న ట్రంప్.. ఇతర ప్రపంచ దేశాలను సైతం ప్రశాంతంగా వదలడం లేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టారిఫ్‌ల మోత మోగిస్తున్న ట్రంప్.. తాజాగా మరోసారి టారిఫ్ వార్‌కి తెరతీశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే.. పేటెంట్ పొందిన మందులపై 100 శాతం పన్ను విధించారు. తాజాగా దీనికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. ఔషధాలు, ఔషధ ముడి పదార్థాలను దిగుమతి చేసుకోవడం వల్ల అమెరికా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందన్న ట్రంప్.. అందుకే వాటిపై నూరు శాతం సుంకాలు విధిస్తున్నట్లు తెలిపారు. ట్రంప్ నిర్ణయం భారతీయ ఫార్మా కంపెనీలపై ఏ విధంగా ఉండనుందంటే.. అయితే ట్రంప్ విధించిన సుంకాల నుంచి కొన్ని కంపెనీలకు మినహాయింపు దక్కనుంది. ఇంతకూ ఆ కంపెనీలు ఏవంటే.. 'మోస్ట్ ఫేవర్డ్' కింద ఒప్పందం చేసుకున్న కంపెనీలు. ఏంటీ ఒప్పందం అంటే.. సదరు కంపెనీలు అమెరికాలోనే ఉత్పత్తి కేంద్రాల్ని ఏర్పాటు చేసినా.. లేదా ఏర్పాటు చేస్తామని ఒప్పందం చేసుకున్నా.. ఆ కంపెనీలకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఉంటుంది.

-మిగతా 2 లో

## కేరళంలో రేవంత్ అబద్ధాల ప్రచారం



### ఆరు గ్యారెంటీలపై అబద్ధాలతో మోసం

- కెసిఆర్ లాగే అబద్దాల ప్రచారం అందుకున్న రేవంత్
- తెలంగాణలో అమలు చేయని పథకాలను ప్రచారం చేస్తారా
- ఇది క్షమించరాని మహాపరాథం...ప్రజలను మోసం చేసే యత్నం
- సీఎం రేవంత్ ప్రచారంపై మండిపడ్డ కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాల ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని రేవంత్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ -మిగతా 2 లో

## భారత్ దాడులు చేస్తే బుద్ది చెబుతాం

మొదటి తరువాయి

దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

మొదటి తరువాయి

ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్దాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్దాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

## చెపాక్‌లో చెన్నైకి షాక్..

మొదటి తరువాయి

సూపర్ కింగ్స్‌కు నిరాశే మిగిలింది.ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ రెండో మ్యాచ్‌లోనూ కంగుతిన్నది. భారీ స్కోర్ కొట్టినా పంజాబ్ కింగ్ టాపార్డర్‌ను కట్టడి చేయడంలో బౌలర్లు విఫలమవ్వడంతో సొంత గడ్డపై చతికిలపడింది సీఎస్కే. 210 పరుగుల భారీ ఛేదనలో ఇంప్యాక్ట్ సబ్ ప్రియాన్ష్ ఆర్య(39) ఫోర్లు, సిక్సర్లతో హోరెత్తించాడు. ఖలీల్ అహ్మద్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లో 4, 6 బాదిన ఈ లెఫ్ట్ హ్యాండర్.. వరసగా 4, 6, 4తో మ్యాట్ హెన్రీ(2-54)కి చుక్కలు చూపించాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్(43)తో కలిసి సీఎస్కే బౌలర్లపై ఎదురుదాడితో ప్రియాన్ష్ పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. చితక్కొడుతున్న ప్రియాన్ష్‌ను హెన్రీ బౌల్డ్ చేయడంతో 61 పరుగుల వద్ద తొలి వికెట్ పడింది. ఆ తర్వాత కూపర్ కొన్నొల్లి(36)తో సమన్వయం లోపంతో ప్రభ్‌సిమ్రన్ రనౌటయ్యాడు. శ్రేయాస్ అయ్యర్(50)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాలనుకున్న కొన్నొల్లిని అన్షుల్ కంభోజ్ ఫుల్‌టాస్‌తో బోల్తా కొట్టించాడు. నేహల్ వధేరా(10) జతగా దూకుడు పెంచిన అయ్యర్ అర్ధ శతకం తర్వాత ఔటయ్యాడు. అప్పటికీ పంజాబ్ విజయానికి 24 రన్స్ కావాలి. హెన్రీ ఓవర్లో వధేరా ఔట్ కాగా.. మార్కస్ స్టోయినిస్(9), శశాంక్ సింగ్(14)లు లాంఛనం పూర్తి చేశారు. మరో 8 బంతులు ఉండగానే 5 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును పంజాబ్ చిత్తు చేసింది. గత ఎనిమిదో మ్యాచుల్లో ఏడో విజయంతో సీఎస్కేపై పంజాబ్ తమ ఆధిపత్యం చాటుకుంది.

**కుర్రాళ్లు కుమ్మేయగా**

సొంత మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ కుర్రాళ్లు కుమ్మేశారు. చెపాక్‌లో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఆయుష్ మాత్రే(73) అర్ధ శతకంతో కదం తొక్కగా.. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు సర్ఫరాజ్ ఖాన్(32) దడ పుట్టించాడు. మాత్రే మెరుపులతో డీలా పడిన ప్రత్యర్థిని డెత్ ఓవర్లలో శివం దూబే(45 నాటౌట్) మరింత కుంగదీసేలా బౌండరీలతో విరుచుకుపడ్డాడు. ఈ ముగ్గురి విధ్వంసంతో రెండొందలు కొట్టని చెన్నై.. భారీ స్కోర్‌తో పంజాబ్‌కు సవాల్ విసిరింది.

## రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

మొదటి తరువాయి

ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే.. ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

## ఢిల్లీలో కంపించిన భూమి..

**ప్రాణ భయంతో పరుగులు తీసిన జనం..!**

ఢిల్లీ



దేశ రాజధాని ఢిల్లీలో భూమి ఒక్కసారిగా కంపించింది. ఢిల్లీ -- ఎన్‌సీఆర్‌తో పాటు ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భూకంపం (ఝుతీష్ట్రనఖ్లుఎవ) సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంపం తీవ్రత 9.50 పీఎం(మాగ్నిట్యూడ్ ఎర్త్‌క్వేక్)గా నమోదైంది. భూమి కంపించడంతో ఇళ్లు, ఆఫీసుల నుంచి జనం ప్రాణ భయంతో బయటకు పరుగులు తీశారు.ఢిల్లీతో సహా పంజాబ్‌లోని నోయిడా, ఛండీగఢ్, లూధియానాలో భూకంపం ప్రకంపనలు రేపింది. పూంచ్, శ్రీనగర్, ఉదమ్‌పూర్, జమ్ము కశ్మీర్‌లోనూ భూమి స్వల్పంగా కంపించింది. కొన్ని సెకన్ల పాటు తమ నివాసాలు ఊగిపోయాయని, ఇంట్లోని వస్తువులు కింద పడిపోయాయని.. తాము చాలా భయపడ్డామని కొందరు స్థానికులు తెలిపారు. అయితే.. భూకంపం కేంద్ర, తరంగాల ప్రభావం.. భూకంపం తీవ్రత గురించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

మొదటి తరువాయి

అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్‌ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంని అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

**-వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట**
**-కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేద**
**-అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా**

**గువాహటి,**



చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్ధవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్ము దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

**-అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం**
**-శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత.**
**-ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది**
**-విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**



విశాఖపట్నం,

భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు. 149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు.

ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

మొదటి తరువాయి

కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు.

## ట్రంప్ 'టారిఫ్' బాంబు

మొదటి తరువాయి

వాటి పేటెంట్, ఇతర ఉత్పత్తులపై టారిఫ్ విధింపు ఉండదు. ఒప్పందం చేసుకోని కంపెనీలు మాత్రం సుంకాలు చెల్లించాల్సిందే.. తొలుత 20 శాతం.. తర్వాతి నాలుగేళ్లలో 100 శాతం వరకు టారిఫ్స్ అమలు చేస్తామని వైట్ హౌస్ వెల్లడించింది.ఈ నూతన సుంకాలను అమలు చేసేందుకు కొంత గడువు ఇచ్చింది. దీనిలో భాగంగా చర్చలు జరిపేందుకు పెద్ద ఫార్మా కంపెనీలకు ముందుగా 120 రోజులు.. మిగతా సంస్థలకు 180 రోజుల గడువు ఇచ్చింది. ఏయే కంపెనీలపై ఈ ప్రభావం పెద్ద మొత్తంలో పడుతుందో స్పష్టత లేదు. ఇప్పటికే కొన్ని కంపెనీలు చర్చలు జరిపి.. డీల్స్‌పైన సంతకాలు కూడా చేసినట్లు తెలుస్తోంది.

## కేరళంలో రేవంత్ అబద్దాల ప్రచారం

మొదటి తరువాయి

ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం విడ్డూరం ఉందని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇది సాధారణ అబద్ధం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రయత్నమని కిషన్ రెడ్డి ఆగ్రహించారు. సీఎం రేవంత్ రెడ్డివి మోసం చేసే రాజకీయాలు. గతంలో కేసీఆర్ ఎలా హామీలు ఇచ్చి అమలు చేయలేదో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారు. అమలు చేయకపోయినా 'చేశామని అనుకోండి' అనే ధోరణి ప్రమాదకరం అని హెచ్చరించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇచ్చారా?. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం మోసమైతే.. అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్దాలు చెప్పడం ప్రజలను దగా చేయడమేని అన్నారు. తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి?. ఇవన్నీ చేయకపోయినా.. గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మకండి. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు.

# మతసామరస్యానికి, ఐక్యతకు నిలువుటద్దం జానంపేట ఆలయం

**ఫరూక్‌నగర్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

ఫరూక్‌నగర్ మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తుల సహకారం, ప్రజాప్రతినిధుల ఐక్యతతో అత్యంత వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆలయ విశిష్టతను కొనియాడారు.జానంపేట ఆలయ నిర్మాణానికి సంబంధించిన చారిత్రాత్మక నేపథ్యాన్ని ఆయన గుర్తుచేశారు. పూర్వ రాజు సవై వెంకటరెడ్డి తన తల్లి జానమ్మ జ్ఞాపకార్థం జానంపేటను, తన భార్య కేశమ్మ పేరిట కేశంపేటను నిర్మించారని వివరించారు. 'సవై' అనే బిరుదు వీరత్వానికి ప్రతీక అని, అటువంటి గొప్ప వ్యక్తి నిర్మించిన ఈ ఆలయం నేటికీ ఆధ్యాత్మిక శోభను వెదజల్లుతోందని అన్నారు.జానంపేట ఆలయం రాజకీయాలకు అతీతంగా మతసామరస్యానికి నిలువుటద్దమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, సి. ప్రతాప్ రెడ్డి వంటి నాయకులు పార్టీలకు అతీతంగా బ్రహ్మోత్సవాల విజయానికి కృషి చేస్తున్నారని తెలిపారు. నాయకుల మధ్య ఉన్న ఈ ఐక్యతే షాద్‌నగర్ నియోజకవర్గానికి ఆదర్శమని కొనియాడారు."సనాతన ధర్మం భూమిపై ఉన్న ప్రతి వస్తువును దైవంగా భావిస్తుంది. రాయిని, చెట్టును, జీవులను పూజించడం మన సంస్కృతి. రామరాజ్యంలో కులమతాలకు తావులేదు" అని బక్కని నర్సింహులు వ్యాఖ్యానించారు. అందరూ కలిసిమెలిసి ఉండాలని, భక్త తుకారం వంటి మహానుభావులు చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. బ్రహ్మోత్సవాల విజయానికి సహకరించిన పోలీసు యంత్రాంగం, మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా వేదపండితుల ఆశీర్వచనాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిశ్వర్ రెడ్డి, కుమార్ గౌడ్, ఒగ్గు కిషోర్, కానుగు అంతయ్య, నర్సింలు గుప్తా, అంజయ్య, భూపాల్, బాల్ రెడ్డి, యాదయ్య తదితర భక్తులు పాల్గొన్నారు.




# తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు పొన్నం అశోక్ గౌడ్ కు ఘన సన్మానం

చింతపల్లి సాయిబాబా ఆలయంలో వేదపండితుల ఆశీర్వచనాలు



**చింతపల్లి, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో అత్యధిక ప్రాధాన్యత ఓట్లతో మొట్టమొదటి తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులుగా గెలుపొందిన పొన్నం అశోక్ గౌడ్‌ను గురువారం చింతపల్లి శ్రీ సాయిబాబా ఆలయంలో ఘనంగా సన్మానించారు.ఆలయ చైర్మన్ మంచికంటి ధనంజయ, కార్యదర్శి శ్రీనివాస్, ఇతర ధర్మకర్తలు వేదపండితుల ఆశీర్వచనాలతో ఆయనకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, తెలంగాణ అవోపా అధ్యక్షుడు సముద్రాల రమేష్, న్యాయవాది వెంకటేశ్వరరెడ్డిని కూడా సన్మానించారు.చైర్మన్ ధనంజయ మాట్లాడుతూ, "వీరికి మరెన్నో పదవులు వరించాలని మనసారా కోరుకుంటున్నాం" అని తెలిపారు.

# రాజపేట తండాలో తీరిన రేషన్ కష్టాలు



**మర్రిగూడ, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని రాజపేట తండా గ్రామపంచాయతీ పరిధిలో చిరకాల స్వప్నం నెరవేరింది. గతంలో గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటికీ రేషన్ షాపు లేకపోవడంతో తండా ప్రజలు మూడు కిలోమీటర్ల దూరంలోని వట్టిపల్లికి వెళ్లాల్సి వచ్చేది.ఈ ఇబ్బందులను గమనించిన రాజపేట తండా సర్పంచ్ కోడాల వెంకట్ రెడ్డి పౌర సరఫరాల శాఖ అధికారులతో చర్చించి తండాలోనే తాత్కాలిక రేషన్ షాపును ఏర్పాటు చేయించారు. ఇంటి వద్దకే రేషన్ అందుతుండటంతో దూర భారం తప్పిందని తండా వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

# యువతకు ఆదర్శం దొడ్డి కొమురయ్య స్ఫూర్తి



**నల్లగొండ, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కొమురయ్య చేసిన త్యాగాలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, యాదవ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో హరీష్ రావుకు ఘన స్వాగతం

-పార్టీ శ్రేణుల బ్రహ్మారథం



**షాద్‌నగర్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోడంగల్ నియోజకవర్గం కోస్గి మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో వెలసిన శ్రీ గురు లోకానందు సంత్ మహారాజ్ దేవస్థాన జాతర ఉత్సవాలకు వెళు_న్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీష్ రావుకు షాద్‌నగర్ పట్టణంలో పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.హైదరాబాద్ నుండి కన్వాయ్‌లో బయలుదేరిన ఆయనకు షాద్‌నగర్ బైపాస్ రోడ్డులోని పారడైస్ హోటల్ సమీపంలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్య నేతలు, కార్యకర్తలు బ్రహ్మారథం పట్టారు.షాద్‌నగర్ చేరుకున్న హరీష్ రావుకు అంజయ్య యాదవ్ నేతలతో కలిసి శాలువా కప్పి, పూలమాలలతో సాదరంగా ఆహ్వానం తెలిపారు.

# ఘనంగా దొడ్డి కొమరయ్య జయంతి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ పట్టణంలోని బీసీ భవనంలో శుక్రవారం దొడ్డి కొమరయ్య జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మిర్యాలగూడ డివిజన్ యాదవ్ సంగం అధ్యక్షుడు చిమట ఎర్రయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి చేగొండి మురళీ యాదవ్, గౌరవ సలహాదారు కంపసాటి మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ జేఏసీ కన్వీనర్ మారం శ్రీనివాస్, కొకన్వీనర్ దాసరాజు జయరాజు, డివిజన్ యాదవ్ సంగం గౌరవ సలహాదారు గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, సామాజిక వేత్త డాక్టర్ రాజు, గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాలోతు దశరధ నాయక్, ఉపాధ్యాయుల బీసీ సంఘం జిల్లా నాయకులు రాపోల్ పరమేష్, పిల్లలమర్రి రవికుమార్, పున్న రాములు, రావిరాల ప్రకాష్, రవీందర్ గౌడ్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జనాభా లెక్కల శిక్షణ శిబిరం



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన జనాభా లెక్కల శిక్షణ శిబిరాన్ని డైరెక్టర్ భారతి హోలికేరి పరిశీలించారు. మండల స్థాయి మాస్టర్ శిక్షణ అధికారులకు తగు సూచనలు చేశారు.క్షేత్రస్థాయిలో అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి జనాభా గణన చేయాలని ఆమె సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల ప్రణాళికలకు జనాభా గణాంకాలు కీలకమని తెలిపారు.ఈసారి దేశంలో మొదటిసారిగా డిజిటల్ విధానం ద్వారా మొబైల్ యాప్, వెబ్ పోర్టల్ వినియోగంతో గణన జరగనుందని వెల్లడించారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే ప్రత్యేక పోర్టల్ కూడా అందుబాటులోకి రానుందని చెప్పారు.

# నూతన వధూవరులకు శుభాకాంక్షలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
యువజన కాంగ్రెస్ నాయకులు, న్యాయవాది శిరీష్ కుమార్ వివాహం వీక్షిత తో శుక్రవారం ఆమనగల్లు మండలం అయ్యసాగర్ దేవాలయం సమీపంలోని డీఎంకె ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ వివాహ వేడుకలకు సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానీతులు చల్లా వంశీచంద్ రెడ్డి ఆశ్లేష రెడ్డి దంపతులు మరియు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, అజీమ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, గణేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, నాజర్, దేవరశెట్టి మహేష్, ఆరిఫ్, శ్రీపాల్, శేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

ఎలిగేడు, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఎలిగేడు మండలం నర్సాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో హోమం, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు.ఈ నెల 5న పోచమ్మ బోనాలు, 6న పుట్టకు దానిపోయిట, జోగు తిరుగుట, 7న ఎల్లమ్మ బోనాలు, 8న మదగ్ని కళ్యాణ మహోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ పల్లెర్ల వెంకటేశ్వర గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పల్లెర్ల వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర సదానంద గౌడ్, నాయకులు పల్లెర్ల మొగిలి గౌడ్, కాట అంజయ్య గౌడ్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.



రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో హోమం నిర్వహిస్తున్న గౌడ సంఘం నాయకులు.

# వేసవిలో కూల్.. కూల్..

- వేసవిలో అందరి దృష్టి కూలర్ల వైపే..
- సామాన్యులకు సైతం అందుబాటు ధరల్లో
- కొత్త డిజైన్లతో మార్కెట్లో లభిస్తున్న వైనం




**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రోజు రోజుకు ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడి అధికంగా ఉంటుండగా.. ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపటం లేదు. ఇళ్లల్లోని ఫ్యాన్ గాలి సైతం వేడిగా వస్తున్న క్రమంలో అందరి దృష్టి కూలర్ల వైపు పడింది. ఎండ వేడిమి నుంచి రక్షణ పొందేందుకు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్న పరిస్థితులుండగా.. ఇంట్లో నైనా కూల్ కూల్ గా ఉండాలని భావిస్తున్నారు. ఏసీల కొనుగోలుపై అయిష్టత ఉన్న వారు కూలర్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సమ్మర్ లో ఇంట్లో ఉన్నంత సేపయినా చల్లగా ఉండేందుకు ఇష్టపడుతున్నారు.

**ఆకట్టుకునేలా డిజైన్లు**

చాలా మంది దుకాణదారులు వినియోగదారులను ఆకట్టుకునేందుకు దుకాణం ఎదుట రకరకాల కూలర్లను అందుబాటులో ఉంచుతున్నారు. గతంలో గడ్డితో తయారు చేసిన కూలర్స్ ఉండగా.. తాజాగా కూలింగ్ ప్యాడ్స్ కలిగిన కూలర్లు, బ్లోయర్ తో కూడిన కూలర్ తదితర రకాలు లభిస్తున్నాయి. ఇవి సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.. వేసవి కాలంలో ఇంట్లో ఉన్న ఫ్యాన్ గాలి వేడిగా ఉంటున్న క్రమంలో అధికంగా కూలర్లను కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. మే నెలలో ఎండలు మరింతగా ఉండే అవకాశం ఉండడంతో పాటు వడగాల్పులు వీస్తుంటాయి. ఈ క్రమంలో వాటి నుంచి రక్షణ పొందేందుకు కూలర్లను కొనడానికి మొగ్గు చూపుతున్నారు. కూలర్ల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయనే చెప్పుకోవచ్చు. ప్రారంభ ధర రూ. 3 వేల నుంచి రూ.26 వేల వరకు ఉన్నాయి. ఇందులో లీటర్లు, కంపెనీల బట్టి ధరలుండగా.. అందుబాటులో సామాన్యులు రూ.3వేల నుంచి రూ.10వేల వరకు కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వీటిలో లీటర్ల కెపాసిటీ అధికంగా ఉంటే మరింత చల్లదనంగా ఉంటాయనే భావనలో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

### ఫీచర్స్ ఆధారంగా ధరలు..



**ఎండలు అధికంగా ఉంటున్న క్రమంలో కూలర్లను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. సులభ వాయిదాలతో సామాన్యులకు సైతం ధరలు అందుబాటులో ఉన్నాయి. సైజు, క్వాలిటీని బట్టి మార్కెట్లో అందుబాటులో లభిస్తున్నాయి.**

- కోట రాజేష్ కుమార్, వ్యాపారి

---

## తెలంగాణ జాగృతి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి నియామకం



**రంగారెడ్డి, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ దీవెనలతో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎలిమినేడు గ్రామానికి చెందిన మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి ప్రకటించారు.సీనియర్ నాయకుడిగా జాగృతిలో విశేష సేవలందించిన విజయకిరణ్ రెడ్డి స్వతహాగా రైతు కావడంతో పాటు పాడి పరిశ్రమపై పూర్తి అవగాహన కలిగిన వ్యక్తిగా సుపరిచితుడు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా, వారి సమస్యల పరిష్కారానికి జాగృతి ఎల్లప్పుడూ ముందుంటుందని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే కాకుండా, నేడు రైతుల శ్రేయస్సు కోసం కవితమ్మ నాయకత్వంలో రైతు విభాగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.జిల్లా వ్యాప్తంగా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని, అవసరమైతే రైతుల పక్షాన పోరాడాలని, రైతు శ్రేయోభిలాషులను ఏకం చేస్తూ జాగృతి బలోపేతానికి విశేషంగా కృషి చేయాలని ఆయన సూచించారు.తమ నియామకంపై నూతన అధ్యక్షుడు మంచిరెడ్డి విజయకిరణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "కవిత నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, రైతుల పక్షాన నిలబడి సంస్థ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను" అని ఆయన తెలిపారు. ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షులు పాండురంగారెడ్డి, తోటి జాగృతి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం

- క్యామ చంద్రశేఖర్



**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** దొడ్డి కొమురయ్య పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని గొర్రెల మేకల పెంపకదార్ల సంఘం మండల అధ్యక్షుడు క్యామ చంద్రశేఖర్ అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో శుక్రవారం దొడ్డి కొమురయ్య జయంతి క్యామ చంద్రశేఖర్ మరియు చండీశ్వర కురుమ సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణామన్నారు. నిజాం కాలంలో దుర్భర పరిస్థితుల్లో ఉన్న తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్య మాన్ని నడిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాయికంటి బిక్షపతి, పెద్ద కురుమ ఇప్పల కృష్ణయ్య, సెల్వోజి సూద యాదయ్య, ఉప సర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి, వార్డు సభ్యులు రాఘవేందర్, భానుకిరణ్, సంఘం నాయకులు చేగురి రాములు, బండ శ్రీను, జల్కం నాగార్జున్, క్యామ వెంకటేష్, పిప్పళ్ళ యాదయ్య, కడారి రమేష్, కోస్కే వెంకటేష్, పిప్పళ్ళ రాఘవేందర్, చిందం వెంకటేష్, క్యామ రాజేష్, జల్కం రమేష్, చేగురి మహేష్, దుడ్డు నాగరాజు, కూకుట్ల మహేష్, క్యామ మహేష్, కూకుట్ల మల్లేష్, పార్వతి శ్రీను, నార్లకంటి లక్ష్మీనారాయణ, గోసుల చెన్నయ్య, సిద్ధిగారి దాసు, రాజు, శ్రీను, శివ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గంప లక్ష్మయ్య సేవలు చిరస్మరణీయం

- లయన్స్ మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి
- కడ్తాలలో గంప లక్ష్మయ్య 11వ వర్ధంతి వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ పట్టణానికి చెందిన సంఘ సేవకులు అభ్యుదయ వాది గంప లక్ష్మయ్య గుప్తా చేసిన సేవలు చిరస్మరణీయమని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లయన్ జి. చెన్న కిషన్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా లు అన్నారు. శుక్రవారం కడ్తాల్ బస్టాండ్, మిల్క్ చిల్లింగ్ సెంటర్ ముందు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్, గంప లక్ష్మయ్య ట్రస్ట్, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష్మయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మీల్స్ అండ్ వీల్స్ (అన్నదాన) కార్యక్రమాన్ని వారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంప లక్ష్మయ్య ట్రస్ట్ ద్వారా ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న సేవలు ఎప్పటికీ గుర్తు ఉంటాయని అన్నారు. ఆయన మరణించిన ఆయన సేవలు అందడం చాలా గొప్ప విషయమని చెన్న కిషన్ రెడ్డి కొనియాడారు. నిరుపేద ప్రజలతోపాటు మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నిరుపేదలకు లక్ష్మయ్య ట్రస్ట్ ద్వారా చేయూత అందించడం చాలా గొప్ప విషయమని వారన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గంప శ్రీనివాస్ గుప్తా, లియో క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, కడ్తాల్ మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బి రామకృష్ణ గుప్తా, యువజన సంఘం అధ్యక్షుడు బి వీరేందర్ గుప్తా, కుటుంబ సభ్యులు గంప చంద్రయ్య గుప్త, గంప శ్రీహాన్ గుప్తా, జహంగీర్ అలీ, లాయక్ అలీ, సిద్ది గారి సురేష్, జగన్, శ్రీకాంత్, చెర్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఉపాధ్యాయ వృత్తిలో చుక్క అల్లాజీ గౌడ్ ఎనలేని సేవలు అందిచాడని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి గౌడ సంఘం అధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలోని భవానీ ఫంక్షన్ హాల్లో అల్లాజీ గౌడ్ కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ ముఖ్య అతిథులుగా హాజరై గౌడ సంఘం నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఆయన పని చేస్తూ తనదైన ముద్ర వేసుకున్నాడని అన్నారు. దశాబ్దాల ఉద్యోగ జీవితంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాటమయ్య దేవస్థానం కమిటీ ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్ గౌడ్, ఆమనగల్లు మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గజ్జె వెంకటయ్య గౌడ్, గజ్జె లక్ష్మీపతి గౌడ్, పల్లె నారాయణ గౌడ్, దూసకంటి యాదయ్య గౌడ్, జవాజి రమేష్ గౌడ్, గోదా సతీష్ గౌడ్, గజ్జె నర్సింహా గౌడ్, గుండ్రాతి నరేష్ గౌడ్, గజ్జె బాలకృష్ణ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అధ్యక్షులు గజ్జె రాఘవేందర్ గౌడ్, ముక్రల శివ గౌడ్ ఆంజనేయులు గౌడ్, సాయి గౌడ్ మరియు ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, గుండ్రతి కుమార్ గౌడ్, రఫీ తదితరులు ఉన్నారు.


## పోలీసు శాఖ ఆదేశాల మేరకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఫ్లెక్సీల ఏర్పాటు




**మహబూబాబాద్ ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ సూచనల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వాహన దారులందరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేసే విధంగా సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేపించడం జరిగిందని సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ తెలిపారు ఈ సందర్భంగా పెరుగు కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ ఆదేశాలు ఇవ్వగానే పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 36 వార్డుల్లో ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణం చేయాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు సంభవించిన ఎటువంటి గాయాలు కాకుండా సురక్షితంగా ఉంటామన్నారు కావున పట్టణంలోని ప్రజలందరూ హెల్మెట్ ధరించి పోలీసు శాఖ ఆదేశాలు పాటించాలని పెరుగు కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో కోర్టు సెంటర్ ధర్మన్న స్ట్రీట్ మూడు కోట్ల సెంటర్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## కవల పిల్లల మృతి

- తండ్రిపై అనుమానాలు



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : జూబ్లీనగర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కచ్చు శ్రీశైలం తన ఇద్దరు కవల కూతుళ్లను (గీతాంశీ, గీతాన్విక -- 4 సంవత్సరాలు) పొలంలోని బావిలో ముంచి చంపినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.భార్యాభర్తల మధ్య తరచూ కలహాలు జరుగుతుండగా, ఈరోజు సాయంత్రం పిల్లలను పొలానికి తీసుకెళ్లిన తండ్రి వారిని బావిలో ముంచాడని అనుమానిస్తున్నారు. గీతాంశీ శవం బయటకు తీయగా, గీతాన్విక ఆచూకీ కోసం గజ ఈతగాళ్ల సహాయంతో పోలీసులు గాలిస్తున్నారు.నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని ఎసిపి విజయ్‌కుమార్ పరిశీలించారు. గ్రామంలో శాంతి భద్రతల కోసం పోలీసులు భారీగా మోహరించారు. మరిన్ని వివరాలు వెలువడాల్సి ఉంది.

# త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే





**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఏసుక్రీస్తు మహోత్యాగానికి ప్రతిక అని సంఘ పాస్టర్ బాలరాజు అన్నారు. ఏసు మరణం మానవాళికి మోక్షాన్ని కలిగించిందని చెప్పారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని ఎంబి చర్చిలో గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఆయన సంఘస్తులకు వాక్యోపదేశం అందజేశారు. ఏసుక్రీస్తు సిలువ మరణాన్ని స్మరించుకుంటూ క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్ర దినం గుడ్ ఫ్రైడే అని తెలిపారు. సిలువలో ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటలను స్మరించుకుంటూ శ్రమలను వివరించారు. మానవాళి పాపాలను తొలగించడానికి ఏసుక్రీస్తు తన ప్రాణాలను సిలువ పై ఉన్న సమయం, ప్రత్యేక ఆరాధనలు నిర్వహిస్తారని యేసు మరణం మానవాళికి మోక్షాన్ని కలిగించిందని అందుకే దీనిని గుడ్ ఫ్రైడే, శుభ శుక్రవారం అని విశ్వసిస్తారు. క్రైస్తవులు నేడు విచారణ ప్రార్ధన, పశ్చాతాపంతో గడుపుతారని వివరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు లక్ష్మణ్, సామెల్, పురుషోత్తం, తానయ్య, యాదయ్య, ప్రేమ్ కుమార్, కొండల్, శంకర్, జీకే ఎస్తేరమ్మ, లావణ్య, సంతోష, సరోజ, తబితమ్మ, సృజనమ్మ, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరవాదిని అభినందించిన తుమ్మల



**హైదరాబాద్, ఏప్రిల్ 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా గెలుపొందిన అమరవాది లక్ష్మీనారాయణ, రాష్ట్ర వ్యవసాయశాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాచలం రాములవారి శాలువాతో ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అమరవాది మాట్లాడుతూ, “రాజకీయాలలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలి” అని కోరగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందని, సహకారం అందిస్తామని తుమ్మల హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్రావు, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ లింబాద్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు పోలా సుధాకర్, రాష్ట్ర మహాసభ కార్యదర్శి చారుగుండ్ల వి.ఎల్. నరసింహారావు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## జీసస్ మహాత్యాగానికి గుర్తు-- గుడ్ ఫ్రైడే



**కందుకూరు, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీసస్ కల్వరిగిరిపై శిలువనెక్కిన రోజు గుడ్ ఫ్రైడే అని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, అవధులు లేని త్యాగమే జీసస్ జీవితం అని ఆయన అన్నారు. ప్రతి ఇల్లు, ప్రతి హృదయం ఆనందంతో నిండాలని, క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు.


# న్యాయవాదుల పోరాటంతోనే రక్షణ చట్టం

రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పొన్నం అశోక్ గౌడ్



**ఆమనగల్లు, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ వల్లే న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు అమోదం పొందిందని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్, గ్రంథాలయ కార్యదర్శి న్యాయవాది గణేష్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణ కేంద్రంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు న్యాయవాది పొన్నం అశోక్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు పూలమాల శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లును శాసనసభలో అన్ని పక్షాలు ఆమోదించేలా సీఎం చొరవ తీసుకున్నారని, ఈ సందర్భంగా సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై న్యాయవాదులపై ఎవరైనా దాడులు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా.. అలాంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు అవుతాయని పేర్కొన్నారు. న్యాయవాదులు ఎవరైనా రక్షణ కావాలని పోలీసులను కోరితే రక్షణ కల్పించేలా చర్యలు తీసుకునే విధంగా చట్టంలో రూపొందించినట్లు చెప్పారు. న్యాయవాదులపై దాడులు జరిగితే డీఎస్పీ స్థాయి అధికారి విచారించేలా చట్టం రూపకల్పన చేశారని గవర్నర్ ఆమోదముద్ర తర్వాత అమల్లోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సర్దార్ నాయక్, ఆంజనేయులు గౌడ్, మహేశ్వర్, ప్రభు నాయక్, బిక్య నాయక్, రమేష్, శివ శంకర్, శ్రీశైలం, మహేష్, శ్రీనివాస్, ధర్మేందర్ తదితరులు ఉన్నారు.


## డంప్‌యార్డ్ ప్రతిపాదనపై రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌కు వినతి



**హైదరాబాద్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో నిర్మించ తలపెట్టిన డంప్‌యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌ను కలిశారు. వారంలో రెండోసారి ఈ విషయంపై చర్చ జరగగా, డంప్‌యార్డ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రణవ్ మాట్లాడుతూ ఈ ప్రాంతం వ్యవసాయానికి మూలాధారమని, వేస్ట్ టు ఎనర్జీ యార్డ్ వల్ల ప్రజలతో పాటు పంట పొలాలకు కూడా ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. జనావాసాల మధ్య కాకుండా వేరే చోటుకు ఈ యార్డ్‌ను తరలించాలని కోరారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని, దీనిపై ఎలాంటి ముందడుగు వేయొద్దని సూచించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ నరేందర్ ఈ అంశంపై చర్చిస్తామని భరోసా ఇచ్చారు.

## ఎల్.ఎమ్.డి వద్ద వివాహిత ఆత్మహత్యాయత్నని భగ్నం చేసిన పోలీస్ శాఖ

**కరీంనగర్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కరీంనగర్ ఎల్.ఎమ్.డి డ్యామ్ పరిసరాల్లో ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వివాహితను లేక్ అవుట్ పోస్ట్ పోలీసులు సకాలంలో స్పందించి రక్షించారు. చిగురుమామిడి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన రాణి మనస్తాపానికి గురై నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అనంతరం ఆమె స్వయంగా డయల్ 100కి సమాచారం అందించింది. కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందుకున్న వెంటనే ఆర్.ఎస్.ఐ రమేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డ్ శ్రీనివాస్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న రాణిని రక్షించి తమ వాహనంలోనే కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితురాలు చికిత్స పొందుతుండగా, ప్రాణాలకు ముప్పు లేదని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బందిని సీపీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



**ఉప్పల్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ నియోజకవర్గం లోని మల్లాపూర్ డివిజన్ లో దొడ్డి కొమరయ్య గారి జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్

## బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో రూ.200 కోట్ల అవినీతి కలకలం



**బాలాపూర్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజాధన దుర్వినియోగం వెలుగులోకి రావడంతో డిప్యూటీ కమిషనర్‌తో పాటు పదిమంది ఉద్యోగులను సస్పెండ్ చేశారు. గత రెండు సంవత్సరాల్లో రూ.200 కోట్ల మేర అవినీతి జరిగిందన్న ఆరోపణలు ప్రజల్లో కలకలం రేపుతున్నాయి. ఈ అక్రమాలు మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పదవీకాలంలోనే జరిగాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ఇప్పటివరకు స్పందించకపోవడం మరింత చర్చనీయాంశమైంది. అనుభవం లేకపోయినా రూ.13 కోట్ల పనులు కాంట్రాక్టర్ అన్నాల రాజేందర్ రెడ్డికి అప్పగించడం కూడా అవినీతి నిదర్శనంగా భావిస్తున్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బొర్ర రవి మాదిగ డిమాండ్ చేస్తున్నారు.

## తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తాం



**నల్లగొండ, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను సాధించడానికి కట్టుబడి ఉన్నామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. కెవిపిఎస్ ఆధ్వర్యంలో కొమురయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, నిజాం పాలనలో సామాజిక దోపిడికి వ్యతిరేకంగా పోరాడి 1946లో అమరుడైన కొమురయ్య పేరు తెలంగాణ రైతాంగ పోరాటాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. సమానత్వం, న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, గీతా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న, నరసింహ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నల్లచెరువు సర్పంచ్



**మాడుగుల, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాడుగుల మండలం నల్లచెరువు గ్రామ సర్పంచ్ కట్ట జయమ్మ యాదయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాసిక లలిత మల్లయ్య, వార్డ్ సభ్యులు రాసిక సువర్ణ, అంజయ్య, బూతరాజు సురేష్, కట్ట పద్మ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# మెంతుల నీరు: ఆరోగ్య పరిరక్షణకు సహజ పరిష్కారం

నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యమైంది. ఈ నేపథ్యంలో సహజ పద్ధతుల్లో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునే మార్గాలలో మెంతుల నీరు ఒక ఉత్తమ పానీయంగా ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. రాత్రంతా నానబెట్టిన మెంతుల నీటిని ఉదయం పరగడుపున తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మెంతులలో ఉండే పోషకాలు శరీరంలోని మెటబాలిజాన్ని పెంచి బరువు తగ్గడానికి సహాయపడతాయి. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా మెంతుల నీరు ఉపయోగపడుతుంది. రోజూ ఈ నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి పెరగడంతో పాటు జీర్ణవ్యవస్థ కూడా మెరుగుపడుతుంది. ప్రత్యేకంగా షుగర్ సమస్య ఉన్నవారికి మెంతుల నీరు ఉపయోగకరంగా ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అదేవిధంగా ఇది శరీరంలోని కొవ్వును కరిగించడంలో కూడా సహాయపడుతుంది. క్రమం తప్పకుండా



తీసుకుంటే మొత్తం ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంటుంది.

**మెంతుల నీరు తయారీ విధానం**

ఒక గ్లాసు నీటిలో ఒక టేబుల్ స్పూన్ మెంతులను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగాలి. నానిన మెంతులను అలాగే నమిలి తినవచ్చు లేదా వడకట్టి నీటిని మాత్రమే తాగవచ్చు. సహజమైన ఈ మెంతుల నీటిని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**వ్యాసకర్త**

నరేష్ దండు

చైర్మన్

పర్యావరణ పరిరక్షణ సమితి



## ఉప్పల్--చిల్కనగర్ రహదారి మూసివేతతో ప్రయాణికుల ఇబ్బందులు

**ఉప్పల్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉప్పల్ నుంచి చిల్కనగర్ వెళ్లే ప్రధాన రహదారి పనుల కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కావేరి నగర్ నాలా పనులు కొనసాగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈసీఐఎల్, కుషాయిగూడ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా ఈ మార్గంలో రాకుండా చర్చ్ నుండి వెంకటేశ్వర స్వామి గుడి మార్గం ద్వారా మళ్లుతున్నాయి. ఇదే అదునుగా సర్వీస్ ఆటో డ్రైవర్లు టికెట్ రేట్లు పెంచారని ప్రయాణికులు వాపోతున్నారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటూ, పనులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించిన సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్

- కొర్రతండా లో ఎమ్మెల్యే బాలునాయక్ సూచన మేరకు ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించారు.



**దేవరకొండ ఏప్రిల్ 03. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామం కొర్రతండా కు చెందిన కొర్ర రేఖా-రమేష్ నాయక్ గార్లకు ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో మంజూరైన ఇందిరమ్మ ఇంటిని గ్రామ సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ పాలకవర్గ సభ్యులతో. గ్రామ పెద్దలతో కలిసిప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లాలూ నాయక్,మాజీ సర్పంచ్ పాండు నాయక్,వార్డు సభ్యులు లక్ష్మీ ప్రశాంత్, సునీత బద్దు,సంతోష వెంకట్, కిషన్ నాయక్,వడిత్య స్నేహ వినోద్,పులిజాల నాగరాజు, గ్రామ కాంగ్రెస్ పెద్దలు కొర్ర గణేష్ కొర్ర శ్రీను,జబ్బార్ లాల్,నరేష్,శ్రీకాంత్, రమేష్,నవీన్,చందు,లాల్య, బిచ్చు,మహేష్,మంగులాల్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభించిన రజిని కుమార్





**పెద్దపల్లి, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లిలో శుక్రవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా మెరుగు చందర్‌ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. రజిని కుమార్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీని విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు చందర్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లి పార్టీని మరింత బలపరచడమే తన ప్రాధాన్యమని తెలిపారు. పెద్దపల్లిలో టీఆర్‌పీ కార్యాలయం ప్రారంభం కేవలం ఓ కార్యక్రమం మాత్రమే కాకుండా ప్రాంతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతంగా కనిపిస్తోందని, స్థానికంగా కొత్త నాయకత్వాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం ద్వారా పార్టీ తన విస్తరణ వ్యూహాన్ని అమలు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అఖిల్ భాష, సంజీవ్, జాషువా, శివదాసు రమేష్, నరేష్, మెరుగు సతీష్, ఎర్రం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన తహసీల్దార్ లక్ష్మి నరసింహా రావు



**కరీంనగర్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇటీవల కరీంనగర్ రూరల్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మి నరసింహా రావు శుక్రవారం రోజున మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేశారు. ఈ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగి, పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## డిసిహెచ్ఎస్ కార్యాలయం హెచ్చరిక




**పెద్దపల్లి, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని చెప్పే ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని పెద్దపల్లి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో ఏ బిల్లులు మంజూరు కావు, ఎవరికైనా డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉద్యోగాలు పెట్టిస్తామనే మాటలను నమ్మరాదని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు వారధి సొసైటీ ద్వారానే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భర్తీ చేయబడతాయని తెలిపారు. ఉద్యోగ ఆశావహులు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని వారధి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఉద్యోగ అవకాశాలు ఉంటే వారికి సమాచారం అందజేయబడుతుందని చెప్పారు. జిల్లా ప్రజలకు అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించేందుకు వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు.

## రోడ్డు పనులు పూర్తి అవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ఆర్టీసీ సిబ్బంది



**గన్నేరువరం, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** గన్నేరువరం మండల కేంద్రంలో రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు, ఆర్టీసీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి సక్రమంగా లేక వాహనాలు వెళ్లడానికి స్థలం లేక ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. డబుల్ రోడ్డు మంజూరు అయినప్పటికీ పనులు పూర్తి కాకపోవడం ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా బస్సులు తిరగడానికి, ఆగడానికి సరైన స్థలం లేక ఆర్టీసీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. గుండ్లపల్లి నుండి గన్నవరం వరకు డబుల్ రోడ్డు పూర్తి కాకపోవడంతో ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రజలు ఈ రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేసి ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

## నిర్వాసితులకు న్యాయం చేకూరుస్తాం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం




**గంగాధర, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులు శుక్రవారం గంగాధర మండలం మధురానగర్ ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇండ్లు కోల్పోయి పరిహారం పొందిన లబ్ధిదారులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి దశలవారీగా నారాయణపూర్ గ్రామస్థులను ఆదుకుంటామని, రిజర్వాయర్ క్రింద ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో ప్రత్యక్షంగా మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామడుగు మల్లేశం, బాబు మల్లేశం, బుర్ర కిరణ్, గడ్డం కార్తిక్, రాగుల మల్లయ్య, నరాల శ్రీనివాస్, లోకిని తిరుపతి, బాబు నవిన్ తదితరులు పాల్గొన్నారు.

## కిమ్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేత



**కరీంనగర్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కిమ్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాల బి.ఎస్‌సి ఫుడ్ సైన్స్ విద్యార్థులు కరీంనగర్ డైరీలో 45 రోజుల ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ పెరియాల సాకేత్ రామారావు విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఇంటర్న్‌షిప్‌ల ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక జ్ఞానం, అనుభవం పొందుతూ మంచి ఉద్యోగ అవకాశాలు సాధించగలరని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ అర్జున్ రావు కూడా విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సైన్స్ హెచ్‌ఓడి మహేష్, జువాలజీ హెచ్‌ఓడీ ఎం.డి. అస్లాం, అధ్యాపకులు అంజలి, లయ, సంపత్ కుమార్, రజిత, హారిక పాల్గొన్నారు.

---



**ఉప్పల్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఉప్పల్ నియోజకవర్గం లోని మల్లాపూర్ డివిజన్ లో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు ఎల్లేశ్ యాదవ్ ఇంట్లో" లిచాయ్ పే ములాఖత్ లి"లో భాగంగా కలిసిన బిజెపి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్

# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**కరీంనగర్/హుస్నాబాద్/మంచిర్యాల/పెద్దపల్లి, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు జిల్లాల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో అధికారులు, కురుమ సంఘం ప్రతినిధులు నివాళులర్పించగా, హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ బొమ్మకల్‌లో, మంచిర్యాల జిల్లా సమీకృత కార్యాలయ భవనంలో, పెద్దపల్లి కలెక్టరేట్‌లో కూడా జయంతి కార్యక్రమాలు జరిగాయి. అదనపు కలెక్టర్ చంద్రయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్, స్థానిక ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాం నిరంకుశ పాలనలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన వీరుడు దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకమని ప్రసంగాల్లో పేర్కొన్నారు. జిల్లాల వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రజలు, సంఘాలు, అధికారులు కలిసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

## శ్రీ యజ్ఞవరాహ స్వామి హిందూ సమ్మేళన సమితి ఆహ్వాన పత్రిక విడుదల



**కరీంనగర్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: శ్రీ యజ్ఞవరాహ స్వామి హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో రాబోయే కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమితి అధ్యక్షుడు చోలేటి రమేష్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ప్రొఫెసర్ బోజు శ్రీనివాస్



**హుస్నాబాద్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం ప్రొఫెసర్ బోజు శ్రీనివాస్ శుక్రవారం దర్శించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ఆరె కిషోర్, జిల్లా మీడియా కన్వీనర్ జాల శ్రీనివాస్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి చెందిన ఇలియాజ్ ఖాన్ తన ట్రాక్టర్‌లో మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కరీంనగర్ రూరల్ పోలీసులు బొమ్మకల్ గ్రామంలోని రజ్వీచామన్ వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణాకు అలవాటు పడిన వారిపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని, ఎమ్మార్వో ముందు లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేస్తామని రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# ఘనంగా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం



**మంచిర్యాల, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి ఎంఎన్ఆర్ గార్డెన్‌లో జిల్లా స్థాయి కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కార్మిక మైనింగ్ ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏఐసీసీ సెక్రటరీ సచిన్సావాద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని, సీనియార్టీ ఆధారంగా పదవులు ఇస్తున్నామని, పార్టీ కోసం పనిచేసే వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గత పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని, కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథలో భారీ అవినీతి జరిగిందని విమర్శించారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అక్రమ కేసులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. కార్యకర్తల త్యాగాల వల్లే కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిందని అన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర అప్పులు 8 లక్షల కోట్లను దాటాయని, బియ్యం అక్రమ స్మగ్లింగ్, అవినీతి వల్ల ప్రజలు నష్టపోయారని పేర్కొన్నారు. బీజేపీ మతాల పేరిట రాజకీయాలు చేస్తుందని, రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం బీద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని, దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీకి అవకాశం లేదని, సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలతో విదేశీ పెట్టుబడులు వస్తున్నాయని, త్వరలో ప్రభుత్వాన్ని గాడిలో పెడతామని తెలిపారు. ఈ సమావేశం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ఏకమై పనిచేయాలని పిలుపునిచ్చారు.

## అస్వస్థకు గురై తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న సర్పంచ్ తప్పట్ల రాజు భార్య



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలాబోతారం గ్రామ సర్పంచ్ తప్పట్ల రాజు భార్య సౌజన్య ఆత్మహత్య చేసుకుంది. గత కొన్ని రోజులుగా కడుపునొప్పి బాధతో బాధపడుతున్న ఆమె నిన్న ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కిటికీ చున్నితో ఉరివేసుకుంది. కుమార్తె గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. మొదట ప్రతిమ ఆసుపత్రిలో, అనంతరం కరీంనగర్ గుడ్ లైఫ్ ఆసుపత్రిలో చికిత్సకు తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. సౌజన్య తల్లిదండ్రులు ఆమెకు కడుపునొప్పి సమస్యలు ఉన్నాయని, ఆ కారణంగానే జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని, మరణంపై ఎలాంటి అనుమానం లేదని పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ఈనెల 5వ తేదీన కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జయంతి పోస్టర్‌ను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, దళిత సంఘాల నాయకులు కలిసి ఆవిష్కరించారు. సత్యం మాట్లాడుతూ ఈనెల 5న సివిల్ హాస్పిటల్ పక్కన జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద జరిగే వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈసారి వేడుకలు కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించనున్నామని తెలిపారు. అదేవిధంగా ఈనెల 14న భారతరత్న బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను కూడా అంగరంగ వైభవంగా జరుపుతామని పేర్కొన్నారు. ఏప్రిల్ నెల మహనీయుల మాసమని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్స్‌ను వెంటనే సీజ్ చేయాలని బీఎస్పీ పార్టీ డిమాండ్




**హుస్నాబాద్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :**
హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో నేషనల్ హైవే పక్కన ఏర్పాటు చేసిన వైన్స్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున వెంటనే సీజ్ చేయాలని బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మూడు నెలల క్రితం ఏర్పాటు చేసిన ఈ వైన్స్ హైవేకు సమీపంలో ఉండడం వల్ల వాహనాలు రహదారిపైనే పార్క్ చేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, ప్రమాదాలు జరిగే అవకాశం పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. పర్మిట్ రూంలో హోటల్ మాదిరిగా మటన్, చికెన్, చేపల వంటకాలతో కుర్చీలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, ఇది నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు. యువత మద్యం వ్యసనానికి లోనవుతుండడం వల్ల రోడ్డు ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ, పోలీసులు హైవేపై అక్రమ పార్కింగ్‌పై కేసులు నమోదు చేసి కట్టడి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వేల్పుల రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



**హుస్నాబాద్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలోని బేతేలు ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ఆరాధనలు ఘనంగా నిర్వహించబడ్డాయి. క్రైస్తవ సహోదరులు భక్తిశ్రద్ధలతో పాల్గొని యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను పాస్టర్ కే. ఇశ్రాయేల్ ఆధ్వర్యంలో ధ్యానించారు. ఈ సందర్భంగా ప్రత్యేక గీతాలు, ప్రార్థనలు నిర్వహించగా, విశ్వాసులు ఉపవాస దీక్షలు ఆచరించారు. ఉపవాసం చేసిన భక్తులకు పండ్ల రసాలు పంపిణీ చేశారు. యేసు ప్రభువు శుక్రవారం సిలువపై ప్రాణత్యాగం చేసి, మూడవ రోజు ఆదివారం పునరుత్థానం జరిగినట్లు పాస్టర్ తన సందేశంలో వివరించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో శాంతియుతంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ కార్పొరేటర్ల మీడియా సమావేశం



**కరీంనగర్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉన్నా కరీంనగర్‌కు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. కరీంనగర్‌ను లండన్‌లా మారుస్తామని, మానేరు రివర్ ఫ్రంట్‌తో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన హామీలు మాయమాటలేనని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మైత్రి కన్వెన్షన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ చేసిన వాగ్దానాల వీడియోలను ప్రదర్శించారు. పదేళ్ల అధికారంలో ఉన్నా కరీంనగర్ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ ఏమీ చేయలేదని, ప్రజలను మోసం చేసిన ఘనత ఆ పార్టీదేనని ఆయన విమర్శించారు. 240 కోట్లతో నిర్మించిన తీగల వంతెన బ్రిడ్జ్, మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పేరుతో చేసిన పనులు ప్రజలకు ఉపయోగం లేకుండా పోయాయని గుర్తు చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కట్టుబడి ఉన్నారని, స్మార్ట్ సిటీ నిధులు తెచ్చి నగర రూపురేఖలు మార్చిన ఘనత ఆయనదేనని వేణు ప్రసాద్ అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలోనే నగరపాలక సంస్థ అభివృద్ధి సాధ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు ఒంటెల సత్యనారాయణ రెడ్డి, బండ రమణ రెడ్డి, గాజే శివరాం, మాసం గణేష్, కర్రే అనిల్, విష్ణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



**మంథని, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగిరి మండలం సెంటనరీ కాలనీలో కార్మికుల కోసం సింగరేణి యాజమాన్యం 25 లక్షల రూపాయలతో నిర్మించిన మటన్, చికెన్ షాపులు ఇప్పటికీ ప్రారంభం కానందుపై కార్మిక కుటుంబాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆరు సంవత్సరాల క్రితం నిర్మాణం పూర్తి చేసినా వాడుకలోకి రాకపోవడంతో ఆ సెంటర్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని కార్మికులు ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి జై కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సింగరేణి సిఎండి మరియు డైరెక్టర్ (పా)కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ జిల్లా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ తెలిపారు. వెంటనే ఈ సెంటర్‌ను ప్రారంభించకపోతే ఆర్‌జి-3 జిఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమంలో దీనిని కూడా చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 03 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ బొమ్మకల్ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన భయానక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం రాత్రి 10:15 గంటల సమయంలో తీగల వంతెన వైపు నుండి అతివేగంగా వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు (నెం. యా02జు3223) సమీర్ దాబా ముందు పార్క్ చేసి ఉన్న లారీ (BR21GD2168)ను వెనుక నుండి ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతతో కారు లారీ కిందకు దూసుకుపోయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21) అక్కడికక్కడే మృతి చెందారు. మహమ్మద్ అద్నాన్ (18) తలకు తీవ్ర గాయాలతో, మహమ్మద్ అబ్రార్ (20) స్వల్ప గాయాలతో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద స్థలాన్ని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా పరిశీలించారు. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి నుండి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే పర్యటన



**మహబూబాబాద్, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 11వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ విస్తృత పర్యటన చేశారు. తాగునీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. వేసవికాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలతో దురుసుగా ప్రవర్తించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గూగుల్ జ్యోతి రమేష్ నాయక్, 11వ వార్డు కౌన్సిలర్ బోడ రవి నాయక్, మున్సిపల్ కమిషనర్, ఏఈ, డీఈ, పలు వార్డుల కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా రీడింగ్ ఛాంపియన్‌గా సాయి విజ్ఞత



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రము మెమొంటో అందుకుంటున్న సాయి విజ్ఞత

**ఎలిగేడు, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన రీడింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ముత్యాల సాయి విజ్ఞత (4వ తరగతి) తెలుగు విభాగంలో జిల్లా ఛాంపియన్‌గా ప్రథమ స్థానం సాధించింది. మండల స్థాయిలో ఎంపీపీ ఎస్ సుల్తాన్‌పూర్ విద్యార్థులు జి. వర్షిని, ఏ. ఆశ్రి, ఎం. సాయి విజ్ఞత, బి. హర్షిని విజేతలుగా నిలవగా, జిల్లా స్థాయిలో సాయి విజ్ఞత ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, మండల విద్యాధికారి నరేంద్ర చారి, ఏఏపీసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ రమేష్ రావు, ప్రధానోపాధ్యాయులు దేవేందర్ రావు, సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీపీ స్రవంతి--మోహన్ రావు, మాజీ సర్పంచ్ అర్సనపల్లి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

# అమెరికా రక్షణ బడ్జెట్.. రూ 139 లక్షల కోట్లు !

## ఇరాన్ యుద్ధం వేళ భారీగా పెరిగిన పద్దు



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాన్‌తో యుద్ధం, ప్రపంచ భద్రతా బాధ్యతలతో ఖర్చులను తడిసి మోపెడవుతున్న నేపథ్యంలో 2027 సంవత్సరానికిగాను 1.5 ట్రిలియన్ డాలర్ల (రూ.139 లక్షల కోట్లు) భారీ రక్షణ బడ్జెట్‌ను ఆమోదించాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చట్టసభ సభ్యులను కోరారు. సైనిక కార్యకలాపాలను కొనసాగించడానికి, క్షీణించిన ఆయుధ నిల్వలను పునర్నిర్మించడానికి అమెరికా ప్రయత్నిస్తున్నందున ఈ ప్రతిపాదన ఒక్క సంవత్సరంలోనే పెంటగాన్(రక్షణ శాఖ) వ్యయాన్ని 40 శాతానికి పైగా పెంచుతుంది. ఇది రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత భారీ పెరుగుదల కానున్నది. అమెరికన్ కాంగ్రెస్ రహస్య సమావేశాలను అమెరికా మీడియా ఉటంకిస్తూ ఇరాన్ యుద్ధానికి రోజుకు 200 కోట్ల డాలర్ల వరకు ఖర్చవుతున్నదని పేర్కొంది. దీర్ఘకాలిక పునర్నిర్మాణం, పునఃసరఫరా ఖర్చులను పరిగణనలోకి తీసుకోకముందే ఈ భారం ఎంత తీవ్రంగా ఉందో ఇది స్పష్టం చేస్తున్నది. యుద్ధ సమయంలో సామాజిక కార్యక్రమాలకు నష్టం వాటిల్లినా సరే సైనిక పెట్టుబడికే ప్రాధాన్యత ఇవ్వాలని వాదిస్తూ ట్రంప్ రక్షణ పెంపును అత్యవసరమైనదిగా పేర్కొన్నారు

# నల్లమల్ల నుంచే యాదవుల తిరుగుబాటు యుద్ధం ప్రారంభిస్తాం



**అచ్చంపేట, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లమల్ల గడ్డ నుంచే యాదవుల తిరుగుబాటు యుద్ధం ప్రారంభమైందని యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ తెలిపారు. అచ్చంపేటలో జరిగిన యాదవ జేఏసీ చైతన్య సదస్సులో మాట్లాడుతూ, నల్లమల్ల అడవిని గొర్రెల కాపరులకు మేత కోసం కేటాయించాలని, రాష్ట్ర మంత్రివర్గంలో యాదవులకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం ఇవ్వాలని, రూ.5000 కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కోకాపేట్‌లో నిర్మిస్తున్న యాదవ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మ్యకల శివశంకర్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కడారి కాశీం యాదవ్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు నారమోని నరేష్ యాదవ్, మీడియా కన్వీనర్ ప్రశాంత్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, శీలం వెంకటేష్ యాదవ్, బద్దుల అజయ్ యాదవ్, మహేశ్ యాదవ్, సాయి యాదవ్, జాజాల కుమార్ యాదవ్, బండారి రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు వస్తున్న చమురు ట్యాంకర్ చైనాకు మళ్లింపు



**న్యూఢిల్లీ: ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమెరికా ఆంక్షలకు గురైన ఇరాన్ ముడి చమురు తీసుకెళ్తున్న ఒక చమురు ట్యాంకర్ ప్రయాణం మధ్యలో దారి మళ్లించుకొని భారత్‌కు కాకుండా చైనా దారి పట్టింది. గత ఏడేండ్లలో ఇలా జరగడం ఇది తొలిసారి. నౌకల కదలికలను పర్యవేక్షించే ఓ సంస్థ కథనం ప్రకారం.. పింగ్ షన్ అనే ట్యాంకర్ ఈ వారం ప్రారంభంలో గుజరాత్‌లోని వడినార్‌కు రావాల్సి ఉంది. అయితే అది చైనాలోని డాంగ్‌ఇంగ్‌ను గమ్య స్థానంగా చేసుకొన్నట్టు సంకేతాలను పంపుతున్నది. చాలా వాణిజ్య నౌకలకు తప్పనిసరి అయిన ట్రాకింగ్ వ్యవస్థ ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ సూచించే గమ్యస్థానమే అంతిమమైనదని.. ప్రయాణ సమయంలో అది ఎప్పుడూ మారకపోవచ్చని ఎలాంటి నిర్ధారణ లేదు. ఇటీవల అమెరికా చమురు కొనుగోళ్లపై ఆంక్షలు ఎత్తేసిన నేపథ్యంలో భారత రిఫైనరీలు ఇరాన్ చమురును కొనుగోలు చేసి సముద్ర మార్గంలో తెప్పించుకొనే అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాయి.

# విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తేడాలు



**చెన్నై, ఏప్రిల్ 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తమిళ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికలకు ముందే ఒక నియోజకవర్గాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఎన్నికల్లో ఆయన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్‌లలో పోటీ చేస్తూ నామినేషన్లు వేశారు. అయితే ఎన్నికల అఫిడవిట్‌ల్లో తేడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. పెరంబూర్‌లో సమర్పించిన అఫిడవిట్‌లో తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొనగా, తిరుచ్చి అఫిడవిట్‌లో తనపై రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే బ్యాంక్ ఖాతాలకు సంబంధించి ఇచ్చిన సమాచారం వేర్వేరుగా ఉన్నాయి. ఇలా ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారాన్ని ఇవ్వడం, వాస్తవాలను దాచిపెట్టడం ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తీవ్రమైన ఉల్లంఘన కిందకు వస్తుందని, ఈ క్రమంలో ఆయన నామినేషన్‌ను తిరస్కరించే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అంటున్నారు.